పంట రోడ్డెక్కించేదెలా?

- అధ్వానంగా పుంత రోడ్లు
- మార్కెట్ కమిటీల నిర్లక్ష్యం
- వ్యవసాయ పనులు సాగేదేలా?



అధ్వానంగా పాణింగపల్లి పుంత రోడ్డు

కె.గంగవరం: ఓట్లేసి గెలిపించండి.. అధికారంలోకి వచ్చాక రోడ్లను బాగు చేస్తాం.. మీకు మేలు చేస్తాం అంటూ ఎన్నికల ముందు కూటమి నాయకులు చెప్పిన మాటలివి. తీరా అధికారం చేపట్టాక ప్రజలు, రైతుల కష్టాలను పట్టించుకోవట్లేదని పలువురు విమర్శిస్తున్నారు.

రైతుల ఇక్కట్లు

పొలాల్లో పండించిన పంటను తరలించడానికి పుంత రోడ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. అలాంటి పుంత రోడ్లు అధ్వానంగా ఉండటంతో పంట ఉత్పత్తులను రోడ్డెక్కించేందుకు రైతుల నానా కష్టాలు పడుతున్నారు. వర్షాకాలంలో పుంతలు, కాలువ గట్లపై రోడ్లు లేకపోవడంతో చేలకు వెళ్లాలన్నా, పొలాలకు ఎరువులు, పురుగు మందులు తీసుకుపోవాలన్నా రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేస్తామని గద్దెనెక్కి గెలిచాక రైతుల ఊసే ఎత్తలేదని, కనీసం ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు ఆర్థిక సాయం కూడా పూర్తి స్థాయిలో రైతలందరికీ అందించలేదని విమర్శిస్తున్నారు.

నడిచి వెళ్లేందుకు వీలులేని పరిస్థితి

చిన్నపాటి వర్షానికే పుంత రోడ్లు మోకాళ్ల లోతు బురదతో కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రైతులు వ్యవసాయ పనులకు సమాయత్తం అవుతున్నారు. పుంత రోడ్లు మాత్రం సైకిళ్లు కూడా వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాయి. వర్షాకాలమే కాకుండా వేసవి కాలంలో కూడా పుంత రోడ్లు గోతులమయంగా మారి ప్రమాదరంగా ఉన్నాయి. దీంతో వర్షాలు లేని రోజుల్లో పుంత రోడ్లు గోతులమయంగా మారడంతో ట్రాక్టర్లు తిరగబడుతున్నాయని రైతులు గొల్లుమంటున్నారు. పొలం పండిన పంటను ఇంటికి, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు ట్రాక్టర్లు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కూలీల సాయంతో రోడ్లపైకి చేరుస్తున్నామని రైతులు అంటున్నారు. దాంతో ఖర్చుల భారం పెరిగిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అభివృద్ధి చేయడంలో..

నియోజకవర్గంలోని ప్రజలకు ప్రధానంగా వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్ మండలాల్లోని ప్రతి ఒక్కరూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రతి గ్రామంలో వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు, మార్కెట్ నుంచి విత్తనాలు, వ్యవసాయ సంబంధిత వస్తువులు, ఎరువులు పొలాలకు తరలించడానికి ప్రధాన మార్గమైన పుంత రోడ్లు చాలా బాగుండాలి. కానీ పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. పుంత రోడ్లు రెండు దశాబ్దాల క్రితం అభివృద్ధి చేశారని, ఆ తరువాత ఆ సంగతి పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్ కమిటీలు పుంత రోడ్లను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ప్రతి బస్తాకు మార్కెట్ కమిటీ చెస్ వసూళ్లు చేస్తున్నప్పటికీ పుంత రోడ్ల అభివృద్ధి విషయంలో పక్షపాత వైఖరి అవలంభిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పంట మధ్య దశలో ఉన్నా మరో రెండు నెలల్లో కోత దశకు చేరుకుంటుందని, ఇలాంటి తరుణంలో పంట ఉత్పత్తులను ఎలా గట్టెక్కించాలో రైతులు మదనపడుతున్నారు. ప్రస్తుతం గోతుల మయంగా ఉన్న రోడ్లు, వర్షాలు పడితే ట్రాక్టర్లు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పుంత రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతుల కష్టాలు తీర్చాలి



కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను తీర్చాలి. పుంత రోడ్లు అధ్వానంగా మారాయి. కనీసం సైకిళ్లు కూడా వెళ్లలేని పరిస్థితి దాపరిచింది. తొలకరి సాగు కోసం ప్రస్తుత ప్రభుత్వం పూర్తి స్థాయిలో రైతులందరికీ ఆర్థిక సాయం అందించలేదు. కనీసం పుంత రోడ్లు అయిన బాగు చేస్తే బాగుంటుంది.

–తోకల శ్రీను, కౌలు రైతు, తామరపల్లి.

పుంత రోడ్లతో ప్రయోజనం



పుంత రోడ్లు మెరుగ్గా ఉండడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. గత 10 ఏళ్లగా పుంత రోడ్లను అభివృద్ధి చేయలేదు. దీంతో ప్రస్తుతం అవి అధ్వాన్నంగా ఉన్నాయి.

– రెడ్డి జయరాజు, సుందరపల్లి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సుభాష్ చంద్రబోస్

కె.గంగవరం: మండలంలోని దంగేరులో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ గురువారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో సుబ్రహ్మణ్యం గుడి వద్ద నుంచి ఎరకల రేవు వరకు సుమారు రూ.15 లక్షల ఎంపీ గ్రాంట్‌తో బీటీ రోడ్‌కు, గ్రామ శివారు వాసాల రేవులో రూ.5 లక్షల ఎంపీ గ్రాంట్ నిధులతో రెండు సీసీరోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామ పెద్దలు ఎంపీకి స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం శంకుస్థాపన చేసి గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న బోస్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, వైస్ ఎంపీపీ నీతిపూడి మదుబాల, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, గ్రామ ఉప సర్పంచ్ దారా సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పండు గోవిందరాజు, మాజీ ఎంపీపీ వట్టికూటి రాజశేఖర్, పలు గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగన్‌పై నిందలు దుర్మార్గపు చర్య

అయినవిల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డైరెక్షన్‌లో బొమ్మినీ తిమ్మినీ చేయడంలో బహు దిట్టా అయిన వీరు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు వేయడం దుర్మార్గపు చర్య అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం సిరిపల్లిలోని ఆయన స్వగృహంలో విలేకరుతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే నిధులు, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రజలకు తెలుసని, కేంద్రా ప్రభుత్వ నిబంధనల 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు భాగాలుగా రెండు విడతల్లో గ్రామ పంచాయతీలకు జమ చేయాల్సి ఉందన్నారు. వాటిలో మొదటి విడత నిధులు ఏప్రిల్ నుంచి జూన్‌లో, రెండోవ విడత నిధులు అక్టోబర్ నుంచి డిసెంబర్ నెలలో జమ చేయవల్సి ఉందన్నారు. కానీ ఆర్థిక సం 2024–25కిగాను రెండోవ విడత, 2025–26 కిగాను మొదటి విడత నిధులు ఇప్పటికీ జమ చేయలేదన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంవత్సరం 2025–26కి గాను రావల్సిన రెండోవ విడత నిధులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు మొదటి విడతగా జమ చేసిన నిధులకు సంబంధించిన యూటిలైజేషన్ సర్టిఫికెట్ కోరానున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీలకు రావల్సిన బకాయిలు ఆర్థిక సంవత్సరం 2024–25కి గాను రెండోవ విడత నిధులు, ఆర్థిక సంవత్సరం 2025–26కి గాను మొదటి విడత నిధులు వచ్చే నెలలో జమ చేస్తామన్నారు. పంచాయతీ నిధులన్నీ దారి మళ్లించి ఏదో కొత్తగా ఇస్తున్నట్టు ప్రభుత్వం మాట్లాడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమా, కేంద్ర ప్రభుత్వం అనేది చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంకా గత మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపైన ఆ ప్రభుత్వం మీద నిందలు వేయడం తగదని ఆయన హితవు పలికారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ఆలమూరు: చొప్పెల్లలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆర్డీఓ పి.శ్రీకర్ గురువారం ఆకస్మింగా తనిఖీ చేశారు. మండల పర్యటనలో భాగంగా మండల స్థాయి అధికారుల బృందంతో కలిసి పీహెచ్‌సీని పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహలత, బి.అనంత రామకృష్ణ, ఎంపీడీఓ ఏ రాజు, డిప్యూటీ తహసీల్దార్ టి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

కాజులూరు: విద్యుత్ భారాలు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రభుత్వం వినియోగదారులపై మోపుతున్న భారాలను ప్రతిఘటిస్తూ ప్రజలు ఉద్యమం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి వళ్ల రాజబాబు పిలుపునిచ్చారు. కాజులూరు మండలం ఒంటితాడి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం కౌలు రైతు సంఘం నాయకులు, స్థానికులు విద్యుత్ బారాలకు వ్యతిరేకం ఆందోళనలు చేపట్టారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు పోతుల మహాలక్ష్మి, బుడితి ప్రభాకరరావు, మోకన సత్యనారాయణ, పోతుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలి



గొల్లపాలెంలో ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

కాజులూరు: నియోజకవర్గంలోని కాజులూరు మండలంతో పాటు రామచంద్రపురం, కె.గంగవరం మండలాలను కూడా కాకినాడ జిల్లాలో కలపాలని కోరుతూ గురువారం అఖిలపక్షం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో–కన్వీనర్ సిద్ధూ, అమలాపురం బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండుల ఆధ్వర్యంలో ఆర్యావటం కోళ్లతూము సెంటరు నుంచి గొల్లపాలెం పోలీస్ స్టేషన్ వరకూ విద్యార్థులు, వ్యాపారులు, ఆటో యూనియన్, కార్మిక సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టి కోటిపల్లి రహదారిపై వైఎస్సార్ జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. అమ్మిరాజు తదితరులు మాట్లాడుతూ, రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 60 కిలోమీటర్లకు పైగా వెళ్లాల్సి వస్తుందన్నారు. అదే కాకినాడ జిల్లా అయితే కేవలం 25 కిలోమీటర్లు ప్రయాణిస్తే జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చన్నారు. కె.గంగవరం మండలానికి కోటిపల్లి రేవు నుంచి అమలాపురం దగ్గరే అయినప్పటికీ వరదలు, తుపానులు వంటివి వస్తే పూర్తిగా ప్రయాణం నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు అంగర కృష్ణ, మండల గౌడా సంఘం అధ్యక్షుడు అంగర శ్రీనివాస్ గౌడ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని దర్శించిన ప్రముఖులు




విఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న అమరావవతి హైకోర్టు న్యాయమూర్తి హరిహరనాథ్ శర్మ దంపతులు

అయినవిల్లి: నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అమరావతి హైకోర్టు న్యాయమూర్తి ఎ.హరి హరనాథ్ శర్మ దంపతులు, కలెక్టర్ మహేష్‌కుమార్ దంపతులు, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ దంపతులు, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ప్రధానార్చకులు మాచరి వినాయకరావు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గభవాని ఘన స్వాగతం పలికారు. వీరికి ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

విఘ్నాలు తొలగించు విఘ్నరాజా

- ఘనంగా గణపతి నవరాత్రులు ప్రారంభం
- వాడవాడలా వెలసిన మండపాలు
- గ్రామాల్లో నెలకొన్న సందడి



సోమేశ్వరంలో శివయ్యతో కొలువుదీరిన గణనాథుడు



సోమేశ్వరం మార్కెట్ సెంటర్ వద్ద కొలువుదీరిన ఏకదంతుడు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పూజలందుకుంటున్న డుండి గణపతి

రాయవరం: విఘ్నాలు తొలగించి తమను ఆదుకోవాలని కోరుతూ గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు. వాడవాడలా మండపాలు వెలిశాయి. పలు గ్రామాల్లో మండపాల వద్ద ఆలయ కమిటీలు పోటాపోటీగా విగ్రహాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ సోయగాలతో పాటు పలుచోట్ల భక్తులను అలరించేందుకు ప్రత్యేక సెట్టింగులను ఏర్పాటు చేశారు. రాయవరం, వెదురుపాక, వి.సావరం, లొల్ల, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో చవితి వేడుకలను భక్తులు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మండలంలోని 12 గ్రామాల్లో 68 ప్రదేశాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేసుకున్నారు. వినాయక మండప కమిటీల ప్రతినిధులకు రాయవరం ఎస్సై సురేష్‌బాబు సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి మండపం వద్ద ఇద్దరు 24/7 ఉండాలన్నారు. విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసే విషయాన్ని ముందుగా పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని గ్రామాల్లో బుధ, గురువారాల్లో వినాయకుని పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరాలయంలో ఉన్న దుండి గణపతికి దేవస్థానం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పాలవెల్లి కట్టి పూజలు నిర్వహించారు. భీమేశ్వరాలయ ప్రాంగణంలో జోగా బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రతీఏటా మాదిరిగానే అత్యంత సుందరమైన సెట్టింగ్ వేశారు. వెలంపాలెం కంబాల చెరువు వద్ద భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్ మండలంలోని 12 గ్రామాలు, కపిలేశ్వరపురం మండలంలోని 19, రాయవరం మండలంలోని 12 గ్రామాల్లో బుధవారం వినాయక చవితి పూజలను ఘనంగా నిర్వహించారు. కపిలేశ్వరపురం మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, అచ్యుతాపురం, వడ్లమూరు, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో చవితి పూజలను భక్తి శ్రద్ధలతో చేశారు. మండపేట పట్టణంలోని ప్రధాన కూడళ్లు, వ్యాపార సంస్థల కార్యాలయాల్లోనూ గణనాథున్ని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ఏడిదరోడ్డులోని షిరిడి సాయి ఆలయంలో మహిళా భక్తురాలు భక్తి గీతాలను ఆలపించారు.

క్లుప్తంగా

వైద్య సేవలు మెరుగుపర్చాలి



మండపేట అర్బన్ పీహెచ్‌సీ సేవలను అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట టిడ్కో గృహాల సముదాయం వద్ద ఉన్న అర్బన్ పీహెచ్‌సీ ద్వారా సేవలను మరింత మెరుగుపర్చాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి వైద్యాధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీ ఆవరణలో గురువారం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. సిబ్బంది పనితీరుపై వైద్యాధికారి వి.భవానీని ఆరా తీశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, స్టాఫ్ నర్సు సౌధామణి, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నబాబుకు తోట పరామర్శ



కాకినాడలో కన్నబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): పితృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబును కాకినాడలోని ఆయన నివాసంలో గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. కన్నబాబు తండ్రి సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, నాయకులు వరదా చక్రవర్తి ఉన్నారు.

దాతల ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

కాజులూరు: దాతల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఇతరులకు సహాయపడాలని రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ కోఆర్డినేటర్ దూడల శంకరనారాయణ అన్నారు. దుగ్గుదుర్రు మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యనభ్యశిస్తున్న 45 మంది పేద విద్యార్థులకు తాళ్లరేవు మండలం గాడిమొగ రిలయన్స్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా నోట్ పుస్తకాలు అందజేయగా.. శంకరనారాయణ, సుబ్రహ్మణ్యం గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల పేరెన్స్ కమిటీ చైర్మన్ పైడికొండల కిశోర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి సామాజిక బాధ్యత



ఉపాధ్యాయులను సత్కరించిన సిబ్బంది

కపిలేశ్వరపురం: ఉపాధ్యాయ వృత్తిని సామాజిక బాధ్యతగా భావించాలని మాచర పీఎంశ్రీ పాఠశాల బదిలీ ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. ఇటీవల బదిలీ అయి వివిధ ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులను పాఠశాల ఆవరణలో గురువారం సత్కరించారు. ఎంఈఓ కె.విజయ్‌కుమార్ మాట్లాడుతూ, మాచర పాఠశాలలో అంకిత భావంతో ఉపాధ్యాయులు పని చేశారన్నారు. బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయలు వాడ్రేవు శ్రీనివాసరావు, ప్రభావతి, శిరోమణి, విశ్వనాథ్, రాంబాబును సత్కరించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి గురువారం తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 29న చేసిన కౌన్సిల్ తీర్మానం మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలపై చర్చించేందుకు సమావేశం నిర్వహించనున్నామన్నారు. 14 అంశాలతో కూడిన అజెండాపై చర్చించి తీర్మాణాలు చేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు.

రామచంద్రపురం: పురపాలక సంఘ కార్యాలయంలో సమావేశ మందిరం వద్ద నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్లు, అధికారులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ చైర్మన్‌గా గుత్తుల శ్రీనివాస్, సభ్యులుగా చల్లా సూర్యనారాయణ, మాతా వరప్రసాద్‌బాబు ప్రమాణం చేశారు.

వర్ణమాలలో ఒదిగిన గిడుగు



అక్షరమాలతో 'గిడుగు' చిత్రపటం

రాయవరం: తెలుగు భాషాభిమానులు భాషపై వారికున్న అభిమానాన్ని పలు రూపాల్లో చాటుకుంటారు. అదే కోవలో రాయవరం మండలం వెదురుపాకకు చెందిన చిత్రా వెంకటమోహన్ తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ.. చిత్రలేఖనాన్ని ప్రవృత్తిగా చేసుకున్నాడు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మోహన్ తెలుగు వర్ణమాల, గుణింత అక్షరాలతో గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటాన్ని గీసి నివాళులర్పించినట్లు మోహన్ విలేకరులకు తెలిపారు.

కళకళలాడుతున్న వరి చేలు



రాయవరం: ప్రస్తుతం వరి పంట దుబ్బు కట్టే దశకు చేరుకుంది. ఎక్కడ చూసినా కనుచూపు మేర పచ్చదనంతో కళకళలాడుతోంది. ఆకుపచ్చ వర్ణంతో కూడిన నారుతో కర్షకులంతా కలిసి పుడమి తల్లికి పచ్చచీర నేసినట్లుగా ఉందని అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పచ్చదనం పరుచుకున్న ప్రకృతి రమణీయతతో నయన మనోహరంగా ఉంది. ప్రకృతి ప్రేమికులు ఈ దృశ్యానికి మంత్రముగ్ధులవుతున్నారు.

తెలుగు తేజం అవార్డుకు ఎంపికైన సింగుబాబు



వేణుగోపాల సింగుబాబు

రాయవరం: మండలంలోని వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న సంపర వేణుగోపాల సింగుబాబు 'తెలుగు తేజం' అవార్డుకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని సింగుబాబు గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 31న శ్రీశ్రీ కళావేదిక సారథ్యంలో తెలుగు భాషా దినోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నారు. తెలుగు భాష ఉన్నతికి కృషి చేస్తున్న వారికి తెలుగు తేజం అవార్డులను ప్రదానం చేస్తున్నారన్నారు. ఈ మేరకు కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ నుంచి తనకు ఆహ్వానం అందినట్లు సింగుబాబు తెలిపారు.

వినాయక మండపానికి శాశ్వత నిర్మాణం

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరంలో మంచినీటి చెరువు వద్ద ఏటా నెలకొల్పే బాల గణపతి మండపానికి దాతల సహకారంతో రూ.2 లక్షలతో శాశ్వత షెడ్డు నిర్మాణం చేసినట్లు ఎంపీటీసీ రెడ్డం సతీష్‌రావు తెలిపారు. ఈ మేరకు నూతన షెడ్డును సర్పంచ్ యనమదల మంగాదేవితో కలసి బుధవారం ప్రారంభించి బాల గణపతిని నెలకొల్పి పూజలు చేశారు. సామాని వీర దుర్గాప్రసాద్, యనమదల సూరిబాబు, యనమదల శ్రీను, గీసాల రాజశేఖర్ తదితర దాతలను సమీకరించి వారి సహకారంతో నిర్మాణం పూర్తి చేయించిన మరో దాత సత్యనారాయణరాజుకు ఎంపీటీసీ కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులో రూ.10.90 లక్షల ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామంలో పలు చోట్ల నిర్మించిన సీసీ రహదారులను మంత్రి సుభాష్ ప్రారంభించారు. హౌసింగ్ కాలనీలో రూ. 27.18 లక్షల అంచనా వ్యయంతో జల్‌జీవన్ మిషన్ నిధులతో నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, సర్పంచ్ దాసి మీనా కుమారి, ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎస్ పాయింట్ తనిఖీ



ద్రాక్షారామ మార్కెట్ యార్డులో రేషన్ బియ్యం తూకాలు చూస్తున్న ఆర్డీఓ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ మార్కెట్ యార్డులో ఉన్న ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను జేసీ ఆదేశాల మేరకు రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న స్టాకు ఆన్‌లైన్‌లో, బుక్ రికార్డుల్లోని వివరాలను పరిశీలించారు. తూకాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించిన ఆర్డీఓ గోడౌన్ ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నను వివరణ కోరినట్లు తెలిసింది. కార్యక్రమంలో రామచంద్రపురం తహసీల్దార్ మృత్యుంజయరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలోని పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం మండపేటలో ఎమ్మెల్యే జోగేశ్వరరావు అందజేశారు. నియోజకవర్గంలోని 40 మందికి రూ.18.40 లక్షలు విలువైన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు.